

- మెదక్ బరిలో 53 మంది అభ్యర్థులు
- వీరంతా పోటీలో ఉంటే నాలుగు ఈవీఎంలు అవసరం
- రేపటితో నామినేషన్ల ఉపసంహరణ పూర్తి
- పలువురిని పోటీ నుంచి తప్పించేలా ప్రయత్నాలు
- బుజ్జగిస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు
- తప్పుకుంటామంటూ కొందరి రాయబారాలు



బుజ్జగింపులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఏప్రిల్ 27 : లోక్‌సభ ఎన్నికల్లో ఆసక్తి కరమైన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పోటీచేసిన సెగ్మెంట్‌గా, బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటగా, పలు ఎన్నికల్లో టీడీపీ, బీజేపీలనూ ఆదరించిన స్థానంగా మెదక్‌కు పేరుంది. అయితే ప్రస్తుతం 53 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసిన రికార్డును సైతం సొంతం చేసుకుంది. గడిచిన 2019 ఎన్నికల్లో కేవలం 10 మంది బరిలో నిలిస్తే ఇప్పుడేమో ఐదింతలుగా అభ్యర్థులు నిలవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అయితే రేపటి వరకు ఉపసంహరణలకు తుది గడువు ఉండడంతో 53 మందిలో పోటీ నుంచి తప్పుకునేదెవరో అనే విషయం కూడా తేటతెల్లమవుతుంది.

తేలనున్న అభ్యర్థులు

పోలింగ్‌కు మరో 16 రోజుల సమయం ఉండగా ప్రచారానికి కేవలం 14 రోజులే ఉంది. రేపు ఉపసంహరణలు పూర్తయితేనే బరిలో నిలిచే అభ్యర్థుల జాబితా సిద్ధమవుతుంది. ఈవీఎంలో అభ్యర్థుల సీరియల్ నంబర్లు, గుర్తులు కేటాయిస్తారు. అంతేగాకుండా ప్రధాన పార్టీల గుర్తులతో పోలిన స్వతంత్రుల గుర్తుల వ్యవహారం కూడా బయటపడుతుంది. అందుకే ఆయా గుర్తులు పొందే పార్టీల అభ్యర్థులతోపాటు పలువురు ముఖ్యమైన స్వతంత్ర అభ్యర్థులను ఉపసంహరించుకునేలా ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. పోటీ నుంచి తప్పుకునేందుకు రేపే చివరి గడువు కావడంతో నేడు తమ ప్రయత్నాలను ముమ్మరం చేయనున్నారు.

బూత్‌కు నాలుగు ఈవీఎంలు..

ప్రస్తుతం నామినేషన్లు వేసిన అభ్యర్థులంతా బరిలో ఉంటే మెదక్ లోక్‌సభకు సంబంధించి ప్రతీ పోలింగ్ బూత్‌కు నాలుగు ఈవీఎంలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని 2,098 పోలింగ్ కేంద్రాల్లో 4 చొప్పున ఈవీఎంలను అందుబాటులో ఉంచక తప్పదు. ఒక ఈవీఎం మెషీన్‌లో 16 మంది అభ్యర్థుల పేర్లు, గుర్తులు మాత్రమే ఉంటాయి. ప్రస్తుతం 53 మంది ఉన్నందున నాలుగు ఈవీఎంలను ఏర్పాటు చేయాల్సిందే. ఇదిలాఉంటే రెండు ఈవీఎంలు ఏర్పాటు చేస్తేనే ఓటర్లు తికమక పడిన సందర్భాలు చాలా ఉన్నాయి. అలాంటిది నాలుగు ఈవీఎంలు పోలింగ్ కేంద్రంలో కనిపిస్తే ఓటర్లు తర్జనభర్జన పడే అవకాశాలు లేకపోలేదు. కనీసం 25 మంది ఉపసంహరించుకుంటే రెండు ఈవీఎంలతో ఎన్నికలు జరపవచ్చు. కానీ ఆ పరిస్థితి కనిపించడం లేదు. చివరగా మూడు ఈవీఎంలను ఏర్పాటు చేసే పరిస్థితి రావచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ఉపసంహరణలకు ప్రయత్నం..

ప్రస్తుతం 53 మంది నామినేషన్లు వేయగా ఇందులో వివిధ పార్టీలకు సంబంధించి 16 మంది అభ్యర్థులు ఉండగా మిగతా వారంతా స్వతంత్రులుగా బరిలో నిలవడానికి సిద్ధమయ్యారు. అయితే పలు పార్టీలకు సంబంధించిన గుర్తులు ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. దీంతో అలాంటి పార్టీల తరఫున నామినేషన్లు వేసిన అభ్యర్థులను ఉపసంహరించుకునేలా ప్రయత్నిస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులే తమకు అనుకూల పరిస్థితి కల్పించుకునే దిశగా ఇలాంటి ఆలోచనలు చేస్తున్నారు. గత ఎన్నికల్లో స్వతంత్రులుగా నిలిచిన వారికి కొందరికి వందల సంఖ్యలో ఓట్లు పడగా.. మరికొందరికి వేలల్లో పోలయ్యాయి. వీరెవరో తెలియకున్నా, కనీస ప్రచారం చేయకున్నా భారీగా ఓట్లు పొందారంటే కేవలం ప్రధాన పార్టీల గుర్తులను పోలిన గుర్తులను కేటాయించడం వల్లేనని చెప్పకతప్పదు.

తప్పుకోవడానికీ రాయబారాలు..!

ఎన్నికల బరి నుంచి తప్పుకుంటామంటూ పలువురు రాయబారాలు నెరుపుతున్నట్లుగా సమాచారం ఉంది. కొందరిని ఉపసంహరించుకునేలా ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రయత్నిస్తుండగా.. ఇందుకు రివర్స్‌గా మరికొందరు తామే తప్పుకుంటామంటూ కీలక అభ్యర్థులకు సమాచారం చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందు కోసం తాము వెచ్చించిన ఖర్చుతోపాటు తమ త్యాగానికి తగిన ప్రతిఫలం కూడా అందుకోవాలని ఆశిస్తున్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. గతంలోనూ వెలుగులోకి వచ్చాయి. తాజాగా ఉపసంహరణల గడువు ఉండడంతో మరోసారి ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

జహీరాబాద్‌లో బూత్‌కు రెండు ఈవీఎంలు అవసరం

జహీరాబాద్ పార్లమెంట్‌కు సంబంధించి 26 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 2019 ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 12 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఒక ఈవీఎంలో 16 పేర్లకు అవకాశం ఉండగా, నాడు ఒకే ఈవీఎం సరిపోయింది. ఈసారి మాత్రం 40 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా 14 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 26 మంది అభ్యర్థుల్లో ఎంతమంది ఉపసంహరించుకుంటారో చూడాలి. ఒకవేళ ఉపసంహరణ అనంతరం కూడా 16 మందికిపైగా అభ్యర్థులు బరిలో నిలిస్తే రెండు ఈవీఎంలు అవసరం పడతాయి. నియోజకవర్గ పరిధిలోని ప్రతీ పోలింగ్ బూత్‌లో రెండేసీ ఈవీఎంల చొప్పున ఏర్పాటు చేయాల్సి వస్తుంది.

ప్రతీ ఓటరుకు పోల్ చీటీ

- పంపిణీ ప్రారంభించిన బీఎల్వోలు
- మే 8వ తేదీ వరకు కొనసాగనున్న ప్రక్రియ



బండాపోసాన్‌పల్లిలో పోల్ స్లిప్‌లు అందజేస్తున్న బీఎల్వో


మెదక్ అర్బన్, ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా పోల్‌చీటీల పంపిణీకి శ్రీకారం చుట్టింది. బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు పోల్ చీటీలు అందజేస్తున్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, దుబ్బాక, గజ్వేల్, నర్సాపూర్, పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2,098 పోలింగ్ కేంద్రాలున్నాయి. 18,19,397 మంది ఓటర్లు ఉండగా.. పురుషులు 8,97,788, మహిళలు 9,21,400, ఇతరులు 209 మంది ఉన్నారు. రెవెన్యూ అధికారులు సూచించినట్లు వీరందరికీ బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి పోల్‌చీటీలు అందజేస్తున్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు మే 8వ తేదీ కాగా.. 2వ తేదీ వరకే ప్రతీ ఓటరుకు పోలీ చీటీ పంపిణీ చేసేలా ఆయా గ్రామాల బీఎల్‌వోలు ముందుకెళ్తున్నారు.

చీటీలోనే పూర్తి వివరాలు

ఎన్నికల్లో ఓటు వేసేందుకు పోల్‌చీటీలు ఎంతో ఉపయోగపడుతాయి. ఓటరు పేరు, తండ్రి/భర్త పేరు, పోలింగ్ కేంద్రం పేరు, సంఖ్య, చిరునామా, ఓటరు జాబితాలోని సంఖ్య తదితర వివరాలతోపాటు సంబంధిత బీఎల్వో పేరు, ఫోన్‌నంబర్, ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, పోలింగ్ రోజున ఓటర్లు పాటించాల్సిన నిబంధనలు ఈ చీటీలో ఉంటాయి. ఓటర్ల సమాచారంతో పాటు తమ పరిధిలోని ఏవైనా ఎన్నికల ఉల్లంఘనలు జరిగినా, రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా పోల్ చీటీలపై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారిక వెబ్‌సైట్, 1950 టోల్‌ఫ్రీ నంబర్ కూడా ముద్రించి ఉంది.

ఆశీర్వదించి గెలిపిస్తే..
పేదలకు సేవలందిస్తా
● బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి 7

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే
శాంతిభద్రతలకు విఘాతం
● బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు 7



సమష్టిగా పనిచేయాలి : దీపాదాస్ మున్షీ

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ శనివారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి విశ్వనాథ, పలువురు నాయకులతో కలిసి హైదరాబాద్ నుంచి సిరిసిల్లకు వెళ్తుండగా మార్గమధ్యలో జిల్లాలోని కొండపాక మండలం నాగులబండ వద్ద సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. సమష్టిగా పనిచేయాలని ఈ సందర్భంగా ఆమె నాయకులకు, కార్యకర్తలకు సూచించారు.

- కొండపాక, ఏప్రిల్ 27

జిల్లాను రద్దుచేస్తే సహించేది లేదు

- కేసీఆర్ వల్లే ప్రత్యేక తెలంగాణ సాకారం
- కోనాయిపల్లి వెంకన్న ఆశీస్సులతో పార్టీ ఏర్పాటు
- పదేళ్లలో వందేళ్ల ప్రగతిని సాధించాం
- దేశానికి దిక్సూచిగా బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలు
- ఆవిర్భావ దినోత్సవంలో హరీశ్‌రావు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఏప్రిల్ 27 : స్వరాష్ట్రంతోనే సిద్దిపేట జిల్లా సాకారమైందని, ఈ జిల్లాను రద్దు చేస్తే సహించేది లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాల ఆకాంక్షగా మారిన సిద్దిపేట జిల్లా ఏర్పాటుతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. తెలంగాణను కేసీఆర్ సాధించడం వల్లే ఇదంతా సాధ్యమైందని చెప్పారు. ఇప్పుడు కొత్త జిల్లాలను రద్దుచేసే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయడం తగదన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో హరీశ్‌రావు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2001లో కేసీఆర్ తన మూడు పదవులకు రాజీనామా చేసి టీఆర్ఎస్ పార్టీని స్థాపించారని గుర్తు చేశారు. పార్టీ ఏర్పాటు పత్రాలపై కోనాయిపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలోనే సంతకాలు చేసిన విషయం కార్యకర్తలందరికీ తెలుసన్నారు. ఆనాడు జలదృశ్యంలో ఉద్యమ పార్టీని స్థాపించి అలుపెరగని పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన ఘనత ముమ్మాటికి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేసీఆర్ లేనిదే తెలంగాణ లేదని వివరించారు. పదేళ్లపాటు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండి ఎన్నో సంక్షేమ పథకాలను చేపట్టారని గుర్తుచేశారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్, దళితబంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు దిక్సూచిగా నిలిచాయన్నారు. వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్ చారిత్రాత్మక నిర్ణయమని చెప్పారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని తెలంగాణ నలుమూలలా విస్తరించారని వెల్లడించారు. పదేళ్లలోనే వందేళ్ల అభివృద్ధిని సాకారం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని వివరించారు. తెలంగాణను ఒక మోడల్‌గా తయారుచేశారని, అందుకే దేశవిదేశాల ప్రతినిధులు, నాయకులు, అధికారులు మన రాష్ట్రంలో అనేక పర్యటనలు చేశారని గుర్తుచేశారు. నేడు కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లు బంద్ చేసి తిట్లు ప్రారంభించిన ఘనత మాత్రం కాంగ్రెస్‌వాళ్లకు దక్కిందని ఎద్దేవా చేశారు. అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కనబెట్టి బీఆర్ఎస్ పార్టీని తిట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.



సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ భవన్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు

సూర్య ప్రతాపం

సిద్దిపేటలో 44.3 డిగ్రీలు

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో 43.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు

కొనసాగుతున్న ఆరెంజ్ అలర్ట్



మెదక్, ఏప్రిల్, 27: ఉమ్మడి మెదక్ జిల్లాలో సూర్య ప్రతాపం కొనసాగుతున్నది. ఉక్కబోత, వడగాలులకు జనాలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలు దాటాయి. గత నాలుగు రోజులుగా ఉమ్మడి జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ కొనసాగుతున్నది. ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా సిద్దిపేట జిల్లా తొగుట మండలం తుక్కాపూర్‌లో శనివారం 44.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దొమ్మాటలో 44 డిగ్రీలు, సిద్దిపేట అర్బన్ మండలంలో 43.8 డిగ్రీలు, మెదక్ జిల్లా పాపన్నపేటలో 43.6 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో 43.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతాయని వాతావరణశాఖ తెలిపింది. మధ్యాహ్నం ఇళ్ల నుంచి బయటకు వెళ్లొద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వృద్ధులు, గర్భిణులు, చిన్నపిల్లలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. కూలీలు మండుటెండల్లో పనులు చేయొద్దని, ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకుని ఆరోగ్యం కాపాడుకోవాలని పేర్కొంటున్నారు. నీటి శాతం ఎక్కువగా ఉన్న పండ్లు, కూరగాయలు తినాలని సూచిస్తున్నారు. తక్కువ చక్కెరతో కూడిన పండ్లరసాలు, నీరు, మజ్జిగ, కొబ్బరినీళ్లు తాగాలని చెబుతున్నారు. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సివస్తే గొడుగు లేదా టోపీ, చలువ కళ్లద్దాలు, శరీరమంతా కప్పేలా దుస్తులు ధరించి బయటకు వెళ్లాలని సూచిస్తున్నారు.

24 గంటల పాటు వాహన తనిఖీలు

- రూ.43,72,410 నగదు, 25 తులాల బంగారు ఆభరణాలు సీజ్
- 6,480 లీటర్ల మద్యం పట్టివేత

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 27 : సీపీ డాక్టర్ బి.అనురాధ ఆదేశానుసారం జిల్లాలో శుక్రవారం సాయంత్రం ఐదు నుంచి శనివారం సాయంత్రం ఐదు గంటల వరకు పోలీస్ యంత్రాంగం విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో జిల్లా వ్యాప్తంగా రూ.43,72,410 డబ్బు, 25 తులాల బంగారు ఆభరణాలు, రూ.30,528 విలువైన 6,480 లీటర్ల మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీపీ అనురాధ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బు వెంట తీసుకెళ్లకూడదని సూచించారు. ఎవరైనా అత్యవసరంగా ఎక్కువ మొత్తంలో డబ్బు తీసుకెళితే సంబంధిత ఆధారాలు తప్పకుండా వెంట ఉంచుకోవాలని సూచించారు. వాహనాల తనిఖీ నిర్వహించేటప్పుడు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వాహనదారులు పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. ఓటర్లను ప్రభావితం చేయకుండా డబ్బు, బహుమతులు, లిక్కర్ అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా చేపట్టిన వాహన తనిఖీల్లో పట్టుబడిన వాటి విలువ రూ.70,57,490 ఉంటుందని పేర్కొన్నారు. సీజ్ చేసిన డబ్బు, బంగారు నగలను కలెక్టర్ కార్యాలయంలో ఉన్న గ్రీవెన్స్‌సెల్‌లో అప్పగించనున్నామన్నారు. సంబంధిత బాధితులు సరైన ధ్రువపత్రాలను చూపించి తీసుకెళ్లవచ్చని సీపీ సూచించారు.



ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యం

రేషన్ బియ్యం పక్కదారి

- ఆగని దందా!
- నేరుగా లబ్ధిదారుల నుంచి సేకరణ
- పౌల్ట్రీఫాం, రైస్‌మిల్లులకు విక్రయం
- ఎన్నికల విధుల పేరుతో తనిఖీలు మరిచిన అధికారులు

నారాయణరావుపేట, ఏప్రిల్ 27 : రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. మార్కెట్లో రేషన్ బియ్యానికి మంచి డిమాండ్ ఉండడంతో దందా ఆగడం లేదు. తెల్లరేషన్ కార్డుదారుల నుంచి తక్కువ ధరకు సేకరించి ఎక్కువ ధరకు పౌల్ట్రీ, రైస్‌మిల్లులకు విక్రయిస్తున్నారు. కొందరు ఇంటింటికీ తిరుగుతూ తక్కువ ధరకు సేకరిస్తున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమవడంతో ఇదే అదనుగా రేషన్ బియ్యాన్ని దర్జాగా రవాణా చేస్తున్నారు.

రూ.18కు కొని రూ.25పైగా విక్రయం

జిల్లాలో మొత్తం 2,72,984 రేషన్‌కార్డులు ఉన్నాయి. అందులో 18,379 అంత్యోదయకార్డులు, 82 అన్నపూర్ణకార్డుదారులు ఉన్నారు. జిల్లాలోని 684 రేషన్‌షాపుల ద్వారా నెలకు 5,714 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు. గ్రామాల్లో చౌకధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేసిన బియ్యాన్ని కొంత మంది దళారులు పేదలకు డబ్బు ఆశ చూపి కిలోకు రూ.18 వరకు చెల్లించి బియ్యం సేకరిస్తున్నారు. ఈ బియ్యాన్ని పౌల్ట్రీఫాంలకు, రైస్‌మిల్లులకు కిలో రూ.25కుపైగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కోళ్ల దాణా తయారీలో బియ్యాన్ని అధికంగా వినియోగిస్తారు. రైస్ మిల్లుల్లో రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తారు. దళారులు ఇదే అదునుగా భావించి రేషన్ దందాకు తెరలేపారు. నారాయణరావుపేట మండలం రాజన్న సిరిసిల్ల జిల్లా సరిహద్దుల్లో ఉండడంతో మండలంలోని గ్రామాల్లో సేకరించిన రేషన్ బియ్యాన్ని ఆటోలు, ఇతర వాహనాల ద్వారా గుట్టుచప్పుడు కాకుండా జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారని గ్రామాల్లో బహిరంగంగానే చర్చ జరుగుతుంది. ఇంత బహిరంగంగా బియ్యం రవాణా జరుగుతున్న సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు లేకపోలేదు.

బియ్యం దందాపై చర్యలు తీసుకుంటాం



ప్రజల కోసం ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న రేషన్ బియ్యాన్ని అధిక ధరలు ఆశ చూపించి అక్రమంగా సేకరించి, తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. రేషన్ దుకాణాల నుంచి ప్రతీ లబ్ధిదారుడికి బియ్యం అందించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. ఇప్పటివరకు మండలంలో జరిగే బియ్యం దందా మా దృష్టికి రాలేదు. రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేసే సమయంలో గ్రామాల్లో సిబ్బందితో నిఘా పెట్టిస్తాం. అక్రమంగా బియ్యం తరలిస్తున్నట్లు తెలిస్తే రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందజేసి సహకరించాలి.

- లక్ష్మారెడ్డి, తహసీల్దార్, నారాయణరావుపేట

ఫినాయిల్ తాగిన వృద్ధురాలు మృతి

రాయపోల్, ఏప్రిల్ 27: మంచినీళ్ల డబ్బా పక్కన ఉన్న ఫినాయిల్ తాగిన ఓ వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందింది. రాయపోల్ ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్‌కు చెందిన పంబాల నర్సమ్మ(75) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. ఈ నెల 9న మంచినీళ్ల డబ్బా పక్కన ఉన్న ఫినాయిల్ డబ్బా తీసుకొని తాగింది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. శనివారం మృతురాలి కోడలు భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వెండి వస్తువులు చోరీ

కౌడిపల్లి, ఏప్రిల్ 27: షాపులో వస్తువులు కొనుగోలు చేస్తామని నమ్మించి 50 తులాల వెండి వస్తువులు దొంగిలించిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని ప్రేమ్ అనే వ్యక్తి రాందేవ్ ఫౌన్ బ్రోకర్‌షాపు నిర్వహిస్తున్నాడు. గురువారం చిన్న పిల్లలను షాపులో ఉంచి భోజనానికి వెళ్లాడు. కొందరు వ్యక్తులు షాపులోకి వచ్చి 30 తులాల వెండి కడియాలు, 20 తులాల కాళ్ల పట్టీలను దొంగిలించుకుపోయారు. యజమాని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



వెండికోల్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్



పెద్దశంకరంపేట: బీబీపాటిల్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న కమలాపూర్, చీలపల్లి గ్రామాలకు చెందిన పలువురు యువకులు

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- జహీరాబాద్‌ను మోదీకి బహుమతిగా ఇద్దాం
- బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్

పుల్‌కల్, ఏప్రిల్ 27: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్ పిలుపునిచ్చారు. మండల కేంద్రం పుల్కల్‌తో పాటు వెండికోలు గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పదేళ్లుగా జహీరాబాద్ ఎంపీగా ప్రజలకు సేవలందించానని, రాజకీయ పరిస్థితుల దృష్ట్యా బీజేపీలో చేరి మూడోసారి పోటీ చేస్తున్నానని తెలిపారు. మోదీ అండదండలతో తాను హ్యాట్రిక్ ఎంపీగా గెలుపొంది రికార్డు బ్రేక్ చేస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని మోదీకి బహుమతిగా ఇవ్వాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారి కేంద్ర ప్రభుత్వం అండతోనే నాలుగు లైన్లుగా విస్తరణ చేపట్టానని గుర్తు చేశారు. కాగా వెండికోలు బీఆర్ఎస్ గ్రామ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ భోజన్నగారి శ్రీనివాస్‌గౌడ్ అధ్వర్యంలో గ్రామ అధ్యక్షుడు నీరుడి మహేశ్‌ముదిరాజ్, నాయకులు బేగరి కుమార్, కిష్టయ్య, పద్మయ్య, సిరిపురం లక్ష్మయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పాండుతో పాటు మరో 50 మంది అనుచరులు బీబీపాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావుకులకర్ణి, నాయకులు ఏ.వెంకటనర్సింహారెడ్డి, పల్వట్ల జగదీశ్వర్, రమేశ్‌బస్వరాజ్‌పాటిల్, మంతం చంద్రశేఖర్, చౌటకూర్, పుల్కల్ మండలాల అధ్యక్షులు నీరుడి ప్రవీణ్‌కుమార్‌ముదిరాజ్, పండరి పాల్గొన్నారు.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటు ఖాయం

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికల్లో 400కు పైగా స్థానాలు గెలుచుకొని మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. శనివారం బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో చీలపల్లి, కమలాపూర్, గ్రామాలకు చెందిన 50 మందికి పైగా యువకులు బీబీపాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా యువకులు, మహిళలు అన్నివర్గాల ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారు. గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలు, నాయకులు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ మూడోసారి కమలం గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరాలని పిలుపునిచ్చారు. జహీరాబాద్ ఎంపీగా తనను ఆశీర్వదించి గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు, మాజీ సర్పంచులు అశోక్, సూర్యప్రకాష్, శ్రీశైలం, శ్రావణ్‌కుమార్, మంగలికృష్ణ, గంగారెడ్డి, చీలపల్లి, కమలాకర్ గ్రామాలకు చెందిన రోషిరెడ్డి, కృష్ణారెడ్డి, గంగయ్య, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే శాంతిభద్రతలకు విఘాతం

- బీఆర్ఎస్‌తో ప్రజలకు ఒరిగేది ఏమీ లేదు
- బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు



కొల్చారంలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

కొల్చారం, ఏప్రిల్ 27: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని, బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో రాష్ట్రంలో అవినీతి పాలన సాగిందని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. శనివారం మెదక్ జిల్లా కొల్చారం మండల పరిధిలోని దుంపలకుంట చౌరస్తా, రంగంపేట, కొల్చారంలో జరిగిన కార్నర్ సమావేశంలో పాల్గొన్నారు. అలాగే సంగాయిపేట, చిన్నాఘన్‌పూర్, పోతంశెట్‌పల్లి చౌరస్తా, అప్పాజిపల్లి మీదుగా రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి మాట మారుస్తూ రుణమాఫీని వాయిదాల మీద వాయిదాలు వేస్తూ దేవుళ్లపై ఒట్లు వేస్తున్నాడని అన్నారు. అలాగే పదేళ్లకాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో రుణమాఫీ చేయని మంత్రి హరీశ్‌రావు రాజీనామా అంటూ కొత్త నాటకం ఆడుతున్నాడని విమర్శించారు. ఈ సమావేశంలో నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీయాదవ్, బీజేపీ మండలాధ్యక్షుడు పాతూరి దయాకర్‌గౌడ్, రాంపూర్ మాజీ సర్పంచ్ సామల యాదగిరి, బీజేపీ నాయకులు హరీశ్, గిరి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



చిలప్‌చెడ్‌లో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

రేవంత్ మాటలన్నీ నీటి మూటలే!

చిలప్‌చెడ్, ఏప్రిల్ 27: సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలన్నీ.. నీటి మూటలేనని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఎద్దేవా చేశారు. శనివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన రోడ్‌షో నిర్వహించగా.. ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలు చేశారని ప్రశ్నించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన వాగ్దానం ఏమైందని గుర్తుచేశారు. వృద్ధులకు రూ.4 వేల పింఛన్ ఇస్తానన్న సీఎం ఇంతవరకు అమలు చేశాడా.. అని ప్రశ్నించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఎన్నో సేవలు చేసిందన్నారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి కేంద్ర ప్రభుత్వం చేసిందేనని గుర్తుచేశారు. దేశం సురక్షితంగా ఉండాలంటే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే ఉండాలన్నారు. ప్రజలు పెద్ద మనసుతో నిజానిజాలు గమనించి మాయమాటలకు లోనుకాకుండా బీజేపీకి ఓటేసి.. తనను గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మురళీయాదవ్, బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, ఆయా మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

మోదీకి ఓటేసి గెలిపించాలి

కౌడిపల్లి, ఏప్రిల్ 27: దేశం అభివృద్ధి చెందాలంటే నరేంద్రమోదీకి ఓటేసి గెలిపించాలని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. శనివారం శనివారం మండల కేంద్రంలో భారీ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు గ్యారంటీలు అమలు చేసిందా.. అని ప్రచారానికి వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు మురళీధర్‌యాదవ్, జిల్లా నాయకులు ఖాజిపేట రాజేందర్, గోడ రాజేందర్, బీజేపీ మండలాధ్యక్షుడు రాకేశ్‌తో పాటు వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

సివిల్ ర్యాంకర్‌కు ఎమ్మెల్సీ సత్కారం



అఖిల్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

కొండపాక, ఏప్రిల్ 27: కొండపాకకు చెందిన సివిల్ ర్యాంకర్ బుద్ధి అఖిల్‌ను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి శనివారం కొండపాకలోని ఆయన స్వగృహంలో ఘనంగా సత్కరించి మాట్లాడారు. అఖిల్ సివిల్స్‌కు ఎంపికకావడం గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఎంతోమంది విద్యార్థులకు ఆదర్శంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నర్రా భాస్కర్ రెడ్డి, కొండపాక మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్రా జైపాల్‌రెడ్డి, పీఆర్టీయూ నాయకులు వెంకటరమణ, తిరుపతి పాల్గొన్నారు.

ఆశీర్వదించి గెలిపిస్తే.. పేదలకు సేవలందిస్తా..

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 27: ఆశీర్వదించి గెలిపిస్తే.. అందరికీ సేవలందిస్తానని బీఆర్ఎస్‌మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని బస్టాండ్ ప్రాంగణం, సమీకృత మార్కెట్, దుకాణాలు తదితర ప్రాంతాల్లో నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ అధికారిగా పనిచేసిన ప్రాంతం నుంచి ఎంపీగా పోటీచేసే అవకాశం దక్కడం గొప్ప విషయమన్నారు. ఎంపీగా ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపిస్తే మెదక్ అభివృద్ధి కోసం కృషిచేస్తానని చెప్పారు. మెదక్ పార్లమెంట్ పరిధి ప్రజల రుణం తీర్చుకునేందుకు తన ఉమ్మడి కుటుంబ ఆస్తి నుంచి రూ.100 కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేస్తానని హామీనిచ్చారు. కాంగ్రెస్ నుంచి నిలకడ లేని మనిషి, బీజేపీ నుంచి ప్రగల్భాలు పలికే వ్యక్తి పోటీచేస్తున్నారని, జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేయాలన్నారు. అలవిగాని హామీలు ఇచ్చి మోసం చేసినందుకు బీజేపీ అభ్యర్థిని గతంలో దుబ్బాకలో ప్రజలు చిత్తుగా ఓడించిన విషయాన్ని గుర్తుచేశారు. తాను ఇచ్చిన మాట కోసం ప్రాణమైనా ఇస్తానని చెప్పారు. ఎంపీగా గెలిపిస్తే ఐదేళ్ల పాటు నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తానని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో అందరం కారు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తామని దీవించారన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు మంచిగా ఉండేనని, కాంగ్రెస్ పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు, మహిళలకు, వృద్ధులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ రాజమౌళి, కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.



గజ్వేల్‌లోని సమీకృత మార్కెట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వెంకట్రామారెడ్డి

వెంకట్రామారెడ్డి వాహనం తనిఖీ

కొండపాక, ఏప్రిల్ 27: దుద్దెడ శివారులోని టోల్ ప్లాజా చెక్‌పోస్ట్ వద్ద వెంకట్రామారెడ్డి వాహనాన్ని మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం సాయంత్రం తనిఖీ చేశారు.

కాంగ్రెస్‌లోకి భారీగా వలసలు

- సీఎం సమక్షంలో పార్టీలో పలువురి చేరిక

తూప్రాన్, ఏప్రిల్ 27: కాంగ్రెస్ పార్టీలో చేరికల జోష్ పెరిగింది. తూప్రాన్ పట్టణ మాజీ సర్పంచ్ రామునిగారి వీర్‌కుమార్ గౌడ్, మాజీ వార్డుసభ్యులు బొల్లు వెంకటేశ్, అల్లాపురం సిద్ధిరాములు కాంగ్రెస్‌లో చేరారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరగా, సీఎం రేవంత్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. కాగా తూప్రాన్ మున్సిపల్ వైస్ చైర్మన్ నందా శ్రీనివాస్, కౌన్సిలర్ రామునిగారి శ్రీశైలంగౌడ్, మత్స్యశాఖ డైరెక్టర్ గడప దేవేందర్, పట్టణ అధ్యక్షుడు పల్లెర్ల రవీందర్‌గుప్తా, నాయకులు మామిండ్ల కృష్ణ, నాగరాజుగౌడ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు.

సొంత గూటికి కౌన్సిలర్

గజ్వేల్, ఏప్రిల్ 27: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీకి చెందిన 13వ వార్డు కౌన్సిలర్ షెహనాజ్ సమీర్ తిరిగి సొంత గూటికి చేరారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. 2020లో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున గెలిచిన కౌన్సిలర్ అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు. తాజాగా నర్సారెడ్డి ఆధ్వర్యంలో సొంత గూటికి చేరుకున్నారు. ఆయన వెంట వార్డుకు చెందిన నాయకులు ఉన్నారు.



సమీర్‌కు కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కుకునూర్‌పల్లి మండలం నుంచి...

కుకునూర్‌పల్లి, ఏప్రిల్ 27: గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కుకునూరుపల్లి మండలానికి చెందిన మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పలువురు నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కుకునూరుపల్లి మాజీ సర్పంచ్ పోల్కంపల్లి జయంతినరేందర్, ముద్దాపూర్ మాజీ సర్పంచ్ కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు ఇండ్ల కనకయ్య, తూం మహేందర్ పార్టీలో చేరినవారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఐలం యాదవ్, రెడ్డమైన రవీందర్, నరసింహాచారి, రవీందర్, కిష్టారెడ్డి పాల్గొన్నారు.

పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవాలి

- సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



పాపను దత్తత ఇస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేట అగ్రికల్చర్, ఏప్రిల్ 27: పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సూచించారు. శనివారం పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన దంపతులకు జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆరునెలల వయస్సు గల పాపను సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అధికారికంగా దంపతులకు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలను దత్తతకు తీసుకోవాలంటే సిద్దిపేటలో గల శిశు గృహ/జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి, బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ మమత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాము, ప్రొటెక్షన్ ఆఫీసర్ రాజు, శిశు గృహ మేనేజర్ ఝాన్సీ పాల్గొన్నారు.

పని చేయడం లేదని ఘర్షణ

- కొడుకుపై తండ్రి దాడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



నరేష్(ఫైల్)

తూప్రాన్, ఏప్రిల్ 27: పని చేయకుండా తిరగొద్దని తండ్రి హెచ్చరించడంతో చోటు చేసుకున్న ఘర్షణలో కొడుకుపై తండ్రి దాడిచేయగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణ పరిధి ఆబోతుపల్లికి చెందిన పోడేటి రాజుకు ఇద్దరు భార్యలు, ఇద్దరు కుమారులు, ఓ కూతురు.. ఇద్దరు భార్యలు అనారోగ్యంతో మృతిచెందారు. పెద్ద కుమారుడికి పెళ్లి కాగా.. కొల్చారులో అత్తగారి ఇంటి వద్ద ఉంటున్నాడు. కూతురు సంధ్య మాసాయిపేటలో అమ్మగారింటి వద్ద ఉంటుంది. చిన్న కుమారుడు పోడేటి నరేష్(23), తండ్రి రాజు తూప్రాన్ పట్టణంలోని ఇటీవల మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇంట్లో ఉంటున్నారు. నరేష్ ఏ పని చేయకుండా తిరగడంతో తండ్రీ, కొడుకుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈనెల 25న రాత్రి 8 గంటలకు కూడా పని విషయంలో గొడవ జరిగింది. దీంతో తండ్రి రాజు కొడుకు నరేష్‌ను ఇటుక, బీరు సీసాతో కొట్టాడు. తీవ్రంగా గాయపడిన నరేష్‌ను సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా, శుక్రవారం మృతిచెందాడు. శనివారం రాజు సోదరుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం పేర్కొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

- హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్ సూచన



ప్రసూతి గదిని పరిశీలిస్తున్న హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్

కుకునూరుపల్లి, ఏప్రిల్ 27: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని రాష్ట్ర ప్రజా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ రవీంద్రనాయక్ సూచించారు. శనివారం కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఐపీహెచ్ ల్యాబ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి గదిని పరిశీలించారు. ఏప్రిల్‌లో జరిగిన ప్రసూతి, ఫార్మసీలో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు స్టాక్ మెయింటనెన్స్ ఉండాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలు అందుతున్నాయా.. అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనికి వెళ్లి వడదెబ్బతో ఆస్పత్రికి వచ్చిన రోగితో మాట్లాడుతూ ఇంట్లోనే ఓఆర్ఎస్ ఎలా తయారు చేసుకోవాలో, వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఎంహెచ్‌ఓవో పీ.శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ఏవో రవీందర్, వైద్యులు బల్వీర్‌సింగ్, నమ్రిత్ సిబ్బంది ఉన్నారు.

న్యాయం చేయాల్సిందే

- చెప్యాలలో ఇంటిముందు మృతదేహంతో నిరసన

మిరుదొడ్డి: మిరుదొడ్డి మండలం చెప్యాలకు చెందిన అక్కరాజు నర్సింహులు(39) ఈనెల 25న రాత్రి 11 గంటలకు దొమ్మాట నుంచి చెప్యాలకు వస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన అక్కరాజు స్వామి ఎదురెదురుగా బైక్‌లతో ఢీకొనడంతో నర్సింహులు అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. శనివారం కుటుంబ సభ్యులు నర్సింహులు మృతదేహాన్ని స్వామి ఇంటి ఎదుట ఉంచి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్ఐ పరశురాములు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధిత కుటుంబసభ్యులను సముదాయించే ప్రయత్నం చేశారు. తమకు న్యాయం జరిగేవరకూ మృతదేహాన్ని తీసేది లేదని భీష్మించి కూర్చున్నారు. ఎట్టకేలకు బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని తీశారు. మృతుడికి భార్య స్వప్న, ముగ్గురు కుమారులున్నారు.

వాహన తనిఖీల్లో భారీగా నగదు పట్టివేత

మిరుదొడ్డి, ఏప్రిల్ 27: ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో భారీగా నగదు, మద్యం పట్టుబడుతున్నది. మిరుదొడ్డి మండలం చెప్యాల చౌరస్తాలో శనివారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.3,52,300 లక్షలు పట్టుబడినట్టు మిరుదొడ్డి ఎస్ఐ పరశురాములు తెలిపారు. దౌల్తాబాద్ మండలం నర్సంపల్లి గ్రామానికి చెందిన రాజు నుంచి రూ.54,800 వేలు, మర్కుక్ మండలానికి చెందిన బీరప్ప నుంచి రూ.2,04,600 లక్షలు, దౌల్తాబాద్ మండలం మల్లేశంపల్లి గ్రామానికి చెందిన కుర్వ యాదగిరి వద్ద రూ.92,900 వేలను సీజ్ చేసినట్టు తెలిపారు.

మద్దూరులో రూ.1,76,340 లక్షలు..

మద్దూరు, ఏప్రిల్ 27: మద్దూరు మండలంలో పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో రెండు వాహనాల్లో తరలిస్తున్న రూ.1,76,340 లక్షల నగదును సీజ్ చేశారు. ఈ విషయమై ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ మాట్లాడారు. శుక్రవారం రాత్రి రేబర్తి శివారు క్రాసింగ్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కాగా చేర్యాల మండలం వేచరేణి గ్రామానికి చెందిన పొలెబోయిన సత్యనారాయణ వాహనంలో తనిఖీ చేయగా.. రూ.1,01,640 లక్షలు లభించాయి. అలాగే శనివారం ఉదయం మద్దూరు కమాన్ వద్ద చేపట్టిన వాహనాల తనిఖీల్లో జనగామ జిల్లా నర్మెట మండలం మచ్చుపహాడ్‌కు చెందిన బానోతు నవీన్ వాహనంలో రూ.74,700 వేలు లభించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జగదీశ్వర్, కానిస్టేబుల్ సిద్ధు పాల్గొన్నారు.

బెజ్జంకిలో రూ.1,06,140 లక్షలు..

బెజ్జంకి, ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పోలీసులు బెజ్జంకి మండలంలో ని రాజీవ్ రహదారిపై చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.1,06,140 లక్షలు పట్టుబడినట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

మాడ్గి చెక్‌పోస్టు వద్ద రూ.99,500 వేలు..

జహీరాబాద్, ఏప్రిల్ 27: మొగుడంపల్లి మండలంలోని మాడ్గి చెక్‌పోస్టు వద్ద శనివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మహారాష్ట్రకు చెందిన సంతోష్ తన కారులో తెలంగాణకు తీసుకొస్తున్న రూ.99,500 పట్టుకున్నామని చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేష్ తెలిపారు.

గుర్జకుంట వద్ద రూ.65వేలు..

చేర్యాల, ఏప్రిల్ 27: కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో చేర్యాల మండలం గుర్జకుంట క్రాస్‌రోడ్డు సమీపంలోని స్వాగతతోరణం వద్ద శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీలో రూ.65 వేల నగదు పట్టుకున్నారు. చేర్యాల పట్టణానికి చెందిన నగేశ్ కారులో రూ.65 వేలు పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.



మద్దూరు కమాన్ వద్ద పోలీసులు పట్టుకున్న నగదు

రూ.23,400 వేల మద్యం సీజ్

నంగునూరు, ఏప్రిల్ 27: నంగునూరు మండలం ముండ్రాయి బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా.. (టీఎస్ 36 టీ 6861) నెంబరు గల డీసీఎంలో ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న మద్యాన్ని శనివారం పట్టుకుని సీజ్ చేసినట్టు రాజగోపాలపేట ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డి నుంచి హుస్నాబాద్‌కు ప్రభుత్వ అనుమతి లేకుండా 144(12 కాటన్లు) బీర్లను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వీటి విలువ రూ.23,400 వేలు ఉంటుందని చెప్పారు. డీసీఎం డ్రైవర్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మోదీ పాలనలో ప్రమాదం అంచున రాజ్యాంగం

- తెలంగాణ జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వా లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కవ్వా లక్ష్మారెడ్డి

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 27: ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో భారత రాజ్యాంగం ప్రమాదం అంచున ఉందని తెలంగాణ జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వా లక్ష్మారెడ్డి ఆరోపించారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని రిటైర్డు ఉద్యోగుల సంఘ భవనంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 29వ తేదీన హుస్నాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పదేళ్ల బీజేపీ పాలనలోని వైఫల్యాలపై, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి జేఏసీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ పరిరక్షణ సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్లు కోదండరాం, యోగేంద్ర యాదవ్, కన్నెగంటి రవిలు హాజరవుతున్నారన్నారు. సమావేశంలో జేఏసీ కో ఆర్డినేటర్లు మేకల వీరన్నయాదవ్, డ్యాగల సారయ్య, కేడం లింగమూర్తి, గడిపె మల్లేశ్, కొయ్యడ కొంరయ్య, రాజగోపాల్‌రావు, దండిలక్ష్మి, ప్రకాశ్, రాజ్‌కుమార్, నాంపల్లి సమ్మయ్య, సుదర్శన్, వీరసోమయ్య ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో ఎంతో లాభం

- వ్యవసాయ అధికారి నాగేందర్‌రెడ్డి

మర్కుక్, ఏప్రిల్ 27: ఆయిల్ పామ్ సాగుతో రైతుకు ఎంతో లాభం చేకూరుతుందని వ్యవసాయ అధికారి నాగేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో సుధాకర్‌రెడ్డి అనే రైతుకు చెందిన ఆయిల్ పామ్ క్షేత్రంలో వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పూలగుత్తులను తీయు విధానంపై రైతు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఉద్యాన అధికారి సువర్ణ మాట్లాడుతూ.. భారత వంటనూనె పరిశ్రమ అమెరికా, చైనా, బ్రెజిల్ తర్వాత మనది నాలుగవ అతిపెద్ద పరిశ్రమ అని, పామాయిల్‌ను బేకరీ ఉత్పత్తుల తయారీకి, గృహ అవసరాలకు వినియోగిస్తారన్నారు. ఉత్పత్తి ప్రారంభమైన తర్వాత ఒక్కో చెట్టు గెల ఒక్కోసారి పక్వానికి వస్తుంటాయన్నారు. దీంతో ప్రతి 15 రోజులకొకసారి గెలల్ని కోయాల్సి ఉంటుందన్నారు. వాటిని గంటల వ్యవధిలోనే కంపెనీకి చేర్చాలన్నారు. కంపెనీ నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి సౌమ్య, వ్యవసాయ విస్తరణ అధికారులు విష్ణువర్ధన్, రజనీకాంత్, విజయ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పామ్ తోటలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలి

కొండపాక, ఏప్రిల్ 27: వేసవిలో ఆయిల్ పామ్ తోటలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానవన అధికారి పండరి సూచించారు. మండలంలోని బందారం గ్రామంలో రైతు వెంకరెడ్డికి చెందిన ఆయిల్ పామ్ తోటలను శనివారం వ్యవసాయ శాఖ అధికారి ప్రియదర్శినితో కలిసి సందర్శించారు. తోటల సంరక్షణ కోసం పలు సూచనలు చేశారు. ఆయిల్ పామ్ సాగు వల్ల రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఈ పంటకు నీటి అవసరం కూడా చాలా తక్కువగా ఉంటుందన్నారు. ఆయనవెంట ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ అధికారి హరీష్, ఆయిల్‌ఫెడ్ ప్లాంట్ మానిటర్ అధికారి విజయ్, బందారం ఏఈవో అంజలి పలువురు రైతులు పాల్గొన్నారు.



మర్కుక్ మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగు గురించి వివరిస్తున్న వ్యవసాయాధికారులు



కొండపాక మండలంలోని బందారం గ్రామంలో ఆయిల్‌పామ్ తోటలను పరిశీలిస్తున్న అధికారులు

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న సీఐ, ఎస్ఐ?

- చర్యలు తీసుకోవాలని ఈసీకి సీపీఎం ఫిర్యాదు

చేర్యాల, ఏప్రిల్ 27: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న చేర్యాల సీఐ శ్రీను, ఎస్ఐ దామోదర్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ, ఎన్నికల కమిషన్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి తెలిపారు. శనివారం చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత నెల 20వతేదీన కొమురవెల్లి మల్లన్న ఆలయ పరిధిలోని టీటీడీ సత్రంలో కొమ్మూరి, ఆలయ ఛైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, మహదేవుని శ్రీనివాస్ తదితరులు ధర్మసభ నిర్వహించిన విషయమై లిఖితపూర్వక ఫిర్యాదులందినా, ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై కలెక్టర్ ద్వారా కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారికి, రాష్ట్ర ఎన్నికల అధికారికి జిల్లా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. సమావేశంలో సీపీఎం నాయకులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, రాళ్లబండి శశిధర్, భాస్కర్, కొంగరి వెంకట్‌మావో, ఆలేటి యాదగిరి, చొప్పరి రవికుమార్, రాళ్లబండి నాగరాజు, బద్దిపడిగ కృష్ణారెడ్డి, బండకింది అరుణ్‌కుమార్, దాసరి ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

బెజ్జంకి, ఏప్రిల్ 27: ఆర్థిక ఇబ్బందులతో తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని కల్లెపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోరుకొప్పుల సత్తయ్య (50) అనే వ్యక్తి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. గ్రామంలో ఇంటి నిర్మాణం, వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. తీసుకున్న అప్పులను తీర్చే మార్గం లేక సత్తయ్య మనోవేదనకు గురై తనవ్యవసాయబావి వద్ద శుక్రవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు, అక్కడి నుంచి మెరగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు హరీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. మృతుడికి భార్య శోభ, ముగ్గురు కుమారులు ఉన్నారు.

అనారోగ్య సమస్యలతో..

దుబ్బాక, ఏప్రిల్ 27: దుబ్బాక పట్టణంలోని డబుల్‌బెడ్రూం కాలనీలో శనివారం అనారోగ్య సమస్యతో తాళలేక ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన దేవునిస్వామి (42) అనే వ్యక్తి కొన్నాళ్లుగా బీపీ, షుగర్‌తోపాటు పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ప్రతిరోజు రెండు సార్లు ఇన్సులిన్ కూడా తీసుకుంటున్నాడు. దీంతో ఆర్థికభారం మీదపడటం, అనారోగ్య సమస్య రోజురోజుకూ పెరుగుతుండడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఉమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి చేసిన ఎక్సైజ్ సీఐని సస్పెండ్ చేయాలి

- ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి సంతోష్‌నాయక్



గాయాన్ని చూపిస్తున్న రవి

హుస్నాబాద్, ఏప్రిల్ 27: జనగామ జిల్లా తరిగొప్పుల మండలం బొత్తలపల్లి గ్రామానికి చెందిన భూక్య రవి అనే గిరిజనుడిని గుడంబా సరఫరా చేస్తున్నాడనే కారణంగా శనివారం తీవ్రంగా కొట్టిన హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐ పవన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి సంతోష్‌నాయక్ కోరారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దాడి చేయడంతో రవికి తీవ్రంగా గాయాలయ్యాయని తెలిపారు. తప్పు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి తప్పా దాడి చేయడం ఏమిటని ప్రశ్నించారు. చట్టాన్ని ఉల్లంఘించి, అకారణంగా దాడి చేసిన సీఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కాగా గిరిజనుడిపై తాము దాడి చేయలేదని సీఐ పవన్‌రెడ్డి తెలిపారు. బత్తులపల్లి నుంచి గుడుంబా రవాణా చేస్తున్నాడనే సమాచారంతో తమ సిబ్బంది అతన్ని పట్టుకుని, నాలుగు లీటర్ల గుడంబాను స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. హుస్నాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌కు తీసుకవచ్చి వారి బంధువు రావడంతో పంపించామే తప్పా ఎవరు అతన్ని కొట్టలేదని వెల్లడించారు.

కాషాయ జెండాలను తొలగించడం హేయం

- బీజేపీ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్

గజ్వేల్, ఏప్రిల్ 27: గజ్వేల్ పట్టణంలో కాషాయ జెండాలను తొలగించడం హేయమైన చర్య అని బీజేపీ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్ అన్నారు. గజ్వేల్ పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో కాషాయ జెండాలను తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. హిందూ ధర్మాన్ని, హిందూ సంప్రదాయాలను అణచివేయడంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ విధానాలు ఒక్కటే అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు మైనార్టీల బుజ్జగింపు రాజకీయాలను మానుకోవాలని సూచించారు. ఆయనవెంట బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్, బీజేపీ గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి బల మహేందర్, బీజేపీ ఉపాధ్యక్షుడు మైసవిజయ్, మాడ్గూరి నర్సింహ, గజ్వేల్ పట్టణ కార్యదర్శి నవీన్, గజ్వేల్ పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షుడు సంగెం కరుణాకర్, సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి, దేవేందర్ ఉన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పట్టణ కిసాన్‌మోర్చా కమిటీని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు సంగెం కరుణాకర్ ప్రకటించారు.

బీజేపీ ఇంటింటా ఎన్నికల ప్రచారం



దౌల్తాబాద్ మండల కేంద్రంలో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

దౌల్తాబాద్, ఏప్రిల్ 27: బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ, శనివారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో మెదక్ పార్లమెంట్ కో-కన్వీనర్ చింత సతీష్‌కుమార్, పార్టీ దౌల్తాబాద్ మండల అధ్యక్షుడు సర్వుగారి భూపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. నరేంద్రమోదీని మరోసారి ప్రధానిని చేయాల్సిన బాధ్యతమనందరిపై ఉందన్నారు. మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావునుగెలిపించి ప్రధానమంత్రికి కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. ప్రజలు బీజేపీకి ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామస్వామిగౌడ్, సురేందర్‌రెడ్డి, నర్సిహంలు, కిషన్, ముత్యాల శ్రీనివాస్, నర్సింహరెడ్డి, అంజి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి

కోహెడ, ఏప్రిల్ 27: ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి జరుగుతుందని, అలాగే కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి బండి సంజయ్‌తో జరుగుతుందని ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం కోహెడలో పార్టీ మండల అధ్యక్షుడు ఖమ్మం వేంకటేశం అధ్యక్షతన శక్తికేంద్రాల ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ ఎంత అవసరమో ప్రజలకు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి పిల్లి నర్సయ్య, గౌడ్, శక్తికేంద్రాల ఇన్‌చార్జిలు రామంచ రాంచంద్రరెడ్డి, కక్కర్ల దామోదర్‌గౌడ్, ఎర్రవెల్లి హరిదాస్, మ్యాకాల రజినీకాంత్‌రెడ్డి, చేను తిరుపతి, గాజుల వేంకటేశ్వర్లు, దావా శేఖర్, కంది సత్యనారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, మామిడి కరుణాకర్, ఖమ్మం సతీష్, గిరిధర్, వెంకటేష్, బూత్ అధ్యక్షులు, కోఆర్డినేటర్స్ ఉన్నారు.

'బీఆర్ఎస్‌తోనే తెలంగాణ స్వరాష్ట్రం సాధ్యమైంది'

గజ్వేల్/చేర్యాల, ఏప్రిల్ 27: బీఆర్ఎస్‌తోనే స్వరాష్ట్రం కల సాకారమైందని ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి, ప్రతాప్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్ జెండాను బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తెలంగాణ జెండాను పట్టుకుని ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ స్వరాష్ట్ర కలను సాకారం చేశారన్నారు. వారివెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ ఛైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, నాయకులు ఊడెం కృష్ణారెడ్డి, మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, బబ్బూరి రజిత, జాఫర్‌ఖాన్, ఆకుల దేవేందర్, కరీం, షరీఫ్ తదితరులున్నారు. కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల గ్రామంలో గ్రామశాఖ అధ్యక్షుడు చదరపల్లి నర్సింగరావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తలారి కీర్తన, బొడ్డం పద్మ, బొడ్డం కృష్ణారెడ్డి, తలారి కిషన్, నర్సింహ్మారెడ్డి, సిద్ధిమల్లారెడ్డి, రవీందర్, బాలచంద్రం, కార్తీక్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణ శిబిరం

చేర్యాల, ఏప్రిల్ 27: ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో, చేర్యాల పట్టణంలోని ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో మే 1వతేదీ నుంచి జూన్ 8వ తేదీ వరకు ఉచిత యోగా వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వహకులు సీహెచ్. మల్లారెడ్డి, నర్సింగ్ తెలిపారు. శనివారం వారు చేర్యాలలో విలేకరులతో మాట్లాడారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రహదారిపై లారీ బోల్తా

కొండపాక, ఏప్రిల్ 27: మండలంలోని దుద్దెడ రాజీవ్ రహదారిపై మూల మలుపు వద్ద శనివారం లారీ బోల్తా పడింది. సిద్దిపేట నుంచి హైదరాబాద్ వైపు ఐరన్, స్టీల్ లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు.

బీజేవైఎం యువ సమ్మేళనానికి తరలిన యువకులు

మర్కుక్, ఏప్రిల్ 27: పటాన్‌చెరువు బీజేవైఎం యువ సమ్మేళనానికి సిద్దిపేట జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు నీలం దినేష్, బీజేవైఎం స్టేట్ ప్రోగ్రాం కొఆర్డినేటర్ నెమరి అంజనేయులు గౌడ్, జిల్లా బీజేవైఎం కార్యవర్గం, బీజేవైఎం మర్కుక్ మండలం అధ్యక్షుడు పంజా మధు, ప్రధాన కార్యదర్శి కొండ బాలకృష్ణ, కార్యకర్తలు తాండ స్వామిగౌడ్, బోయిన మహేశ్, నాయకులు తరలివెళ్లారు.

'చర్యలు తీసుకోవాలి'

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 27 : హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డ గిరిజన గురుకుల పాఠశాలలో నిత్యావసర వస్తువులను దొంగిలించిన వారిపై చర్యలు తీసుకోవాలని, భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్(యుఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి కోరారు. శనివారం యుఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పాఠశాలను సందర్శించినట్లు తెలిపారు. విచారించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలోతు రాజేష్, హరీశ్, శ్రీనాథ్ ఉన్నారు.

కారోబార్ మృతి

చేర్యాల, ఏప్రిల్ 27: చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన కారోబార్ చింతల కిష్టయ్య (56) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామ మాజీ సర్పంచ్ పెడుతల ఎల్లారెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తంచేశారు. విషయం తెలుసుకున్న ఎన్ఆర్ఐ పెడుతల అమరేందర్‌రెడ్డి రూ.10వేలు విరాళంగా అందించాడు.

ఆలయాల్లో ఎమ్మెల్యే పూజలు



చిన్నకోడూరు మండలం బిక్కబండలోని పెద్దమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్/నంగునూరు/చిన్నకోడూరు, ఏప్రిల్ 27: నంగునూరు మండలం అక్కెనపల్లిలోని దుర్గాదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఎమ్మెల్యే హరీశ్‌రావు పూజలు చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ సిల్వేరి కృష్ణ, పూజారి నవీన్ చారి స్వాగతం పలికారు. ఆయనవెంట మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఎడ్ల సోమిరెడ్డి, కోల రమేశ్ గౌడ్, కిష్టారెడ్డి, తిప్పని నాగేందర్, ఆలయ కమిటీ సలహాదారులు గుర్రం నారాయణ, జగ్గని బాబు, సంద యాదగిరి ఉన్నారు. చిన్నకోడూరు మండలం ఎల్లాయిపల్లి, బిక్కబండ గ్రామాల్లో జరుగుతున్న పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి హరీశ్‌రావు హాజరై పూజలు చేశారు. ఆయనవెంట జడ్పీ ఛైర్‌పర్సన్ రోజాశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి, వైస్ ఎంపీపీ పాపయ్య ఉన్నారు. ఈ నెల 27న సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలోని ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలకు రావాలని గౌడ సంఘం తరఫున శనివారం సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రికను అందజేశారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- రాష్ట్ర ప్రజారోగ్యశాఖ డైరెక్టర్



ప్రజారోగ్యశాఖ డైరెక్టర్, జిల్లా వైద్యాధికారిని సన్మానిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

దుబ్బాక, ఏప్రిల్ 27: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ రవీంద్రనాయక్ ఆదేశించారు. దుబ్బాక మండలం తిమ్మాపూర్ పీహెచ్‌సీని శనివారం సందర్శించారు. పీహెచ్‌సీ పని తీరును ఆయన పరిశీలించారు. అనంతరం జిల్లా పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చక్రధర్, రాష్ట్ర నాయకులు చెరుకు భాస్కర్ ఉద్యోగుల, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయనతోపాటు జిల్లా వైద్యాధికారి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో తదితరులున్నారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే

గజ్వేల్‌టౌన్, ఏప్రిల్ 27: గజ్వేల్ మండలం జాలిగామ 2 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని మాట్లాడుతూ.. మానవ అభివృద్ధిలో బాల్య విద్యకు చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. పూర్వ ప్రాథమిక విద్యను అందజేయడం వల్ల చిన్నారుల్లో భాష, సామాజిక అభివృద్ధి, మానసిక, భావోద్వేగం లాంటి లక్షణాలు పెరుగుతాయన్నారు. గ్రామంలోని పలువురు తమ పిల్లలను ప్రైవేటు స్కూల్‌ల్లో చేర్పించి, తిరిగి వారిని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సునిత, విద్యార్థుల మాతృమూర్తులు పాల్గొన్నారు.

హవ్వ... ఇవీ కోడిగుడ్లేనా

చేర్యాల, ఏప్రిల్ 27: అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నసైజు కోడిగుడ్లు సరఫరా చేస్తుండటంతో ప్రజలు విస్తుపోతున్నారు. మాతాశిశు మరణాలను తగ్గించేందుకు బలవర్ధకపోషక విలువలున్న గుడ్లను చిన్నారులు, గర్భిణీ, బాలింతలకు అందించేందుకు ప్రభుత్వం ఐసీడీఎస్ ద్వారా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, సంబంధిత అధికారుల పర్యవేక్షణాలోపం, కాంట్రాక్టర్‌ల లాభాపేక్ష కారణంగా నీరు గారిపోతున్నది. అంగన్‌వాడీ కేంద్రాలకు నిర్ణీత పరిమాణంలో ఉన్న కోడిగుడ్లను సరఫరా చేయాల్సి ఉండగా, చిన్నపాటి పరిమాణం గల కోడిగుడ్లు అందిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. చేర్యాల పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ప్రాజెక్ట్ పరిధిలోని పలు కేంద్రాలకు చిన్నపాటి సైజు గుడ్లను అందించారు. వీటిని లబ్ధిదారులకు అందిస్తుండటంతో ఇవీ కోడిగుడ్లేనా అని ఆశ్చర్యపోతున్నారు.

కాలం తీరిన శీతల పానియాల అమ్మకం



కాలం చెల్లిన శీతల పానియం

గజ్వేల్, ఏప్రిల్ 27: గజ్వేల్ పట్టణంలోని ఓ సూపర్ మార్కెట్‌లో కాలం చెల్లిన శీతల పానియాలను విక్రయించారు. గజ్వేల్ పట్టణానికి చెందిన ఓ వినియోగదారుడు శీతల పానియాన్ని ఇంటికి తీసుకువెళ్లి గడువును పరిశీలించగా, ఫిబ్రవరిలోనే గడువు తీరినట్లు గుర్తించారు. ఈ విషయమై వినియోగదారుడు సూపర్ మార్కెట్ నిర్వాహకులను నిలదీశారు. కాగా ఇటీవలే ఐస్‌క్రీంలో పురుగులు రాగా తాజాగా కాలం చెల్లిన శీతల పానియాలను విక్రయించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అబద్ధపు హామీలతో కాంగ్రెస్ మోసం

- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



సమావేశంలో మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

బెజ్జంకి, ఏప్రిల్ 27: అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ రాష్ట్రంలో గద్దెనెక్కిందని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వారంటీ లేని గ్యారంటీలను అమలు చేస్తామని ప్రజలకు చెప్పి, ఎన్ని గ్యారంటీలను అమలు చేసిందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండల అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తే, కాంగ్రెస్ నాయకులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం అభివృద్ధికి అడ్డుపడి నిధులను రద్దు చేశారని ఆరోపించారు. సమస్యలపై మండల ప్రజలు అధికారులకు విన్నవిస్తే సంబంధిత శాఖ అధికారులను అడ్డుపెట్టుకుని వారితోనే ఫిర్యాదు చేసిన వారిని బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్ నియోజకవర్గం పై అవగాహన లేని అభ్యర్థిని కాంగ్రెస్ ప్రకటించిందని, ఆ అభ్యర్థి రాహుల్ గాంధీని ముఖ్యమంత్రిని చేస్తామని మాట్లాడం హాస్యస్పదమన్నారు. భూకబ్జా, అక్రమాలపై తన పై మాట్లాడిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బహిరంగ చర్చకు సిద్ధమా అని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సవాల్ విసిరారు. కరీంనగర్‌లోని ప్రభుత్వ స్థలంలో కవ్వంపల్లి సత్యనారాయణ ఇంటిని నిర్మించుకున్నాడని, పచ్చునూర్‌లో రైతులను బెదిరించి భూమిని పట్టా చేయించుకున్నాడని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని గెలిపించుకుందాం

- ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



శ్రీగిరిపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 27: బీఆర్ఎస్ మెదక్‌ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని గెలిపించుకుందామని ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లి గ్రామంలో శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిపాలనా దక్షత కలిగిన, ప్రజా సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్న మాజీ కలెక్టర్ వెంకట్రామారెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. వారితో ఫాక్స్ ఛైర్మన్ జేజాల వెంకటేశ్, వైస్ ఎంపీపీ బెల్దే కృష్ణాగౌడ్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ శ్రీనివాస్, తాజా మాజీ సర్పంచ్ చంద్రమోహన్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, గొడుగు స్వామి, కంటెమైన నర్సింహులు ఉన్నారు.

ముదిరాజ్‌ల మద్దతు బీఆర్ఎస్‌కే..

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 27: ముదిరాజ్‌ల మద్దతు బీఆర్ఎస్‌కేనని, త్వరలోనే ముదిరాజ్‌ల సమ్మేళనం నిర్వహిస్తామని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, లీగల్‌సెల్ కార్యదర్శి కొట్టాల యాదగిరి ముదిరాజ్ అన్నారు. శనివారం జగదేవ్‌పూర్‌లో ముదిరాజ్ సంఘం నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించడానికి ముదిరాజ్‌లంతా ఏకగ్రీవంగా తీర్మానాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సత్యం, రవి, రాజు, చంద్రం, గజ్వేల్ ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు నర్సింహులు తదితరులు ఉన్నారు.

ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు కృషిచేయాలి

- మెదక్ లోకసభ ఎన్నికల వ్యయ పరిశీలకుడు సునీల్‌కుమార్



గజ్వేల్ మండలంలోని బేగంపేట వద్ద బస్సును తనిఖీ చేస్తున్న వ్యయ పరిశీలకుడు సునీల్‌కుమార్

గజ్వేల్/జగదేవ్‌పూర్ ఏప్రిల్ 27: ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు కృషిచేయాలని మెదక్ లోకసభ ఎన్నికల వ్యయ పరిశీలకుడు సునీల్‌కుమార్ సూచించారు. గజ్వేల్ నియోజకవర్గంలోని ములుగు, బేగంపేట, కాళ్లకల్, జగదేవ్‌పూర్ ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టులను శనివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం గజ్వేల్ పట్టణంలోని ఏఆర్‌వో కార్యాలయంలో ఎన్నికల నిఘా బృందాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగదు, మద్యం రవాణా జరుగకుండా ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఆయనవెంట ఆర్డీవో బన్సీలాల్, అధికారులు ఉన్నారు. మెదక్ లోక్‌సభ ఎన్నికల వ్యయ పరిశీలకులు సునీల్‌కుమార్ శనివారం జగదేవ్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీని పరిశీలించారు. పోలీసులు ఆపిన పలు వాహనాలను ఆయనే స్వయంగా తనిఖీ చేశారు.

ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలి

దౌల్తాబాద్‌ఏప్రిల్27: ప్రతీ ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రామయంపేట రోడ్డులో వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. శుక్రవారం ఓ వ్యక్తి వద్ద ఉన్న రూ.60 వేలు సీజ్ చేశామన్నారు. రసీదు లేకుండా రూ.50 వేల కన్న ఎక్కువ డబ్బులు తీసుకెళితే ఆధారాలు తప్పనిసరిగా చూపాలన్నారు. ఆయన వెంట హెడ్‌కానిస్టేబుల్ విక్రమ్, రాజగౌడ్, సాయి, నాగరాజు, స్వామి తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- డీఎంజీ బాలకిషన్



దూళిమిట్ట మండలంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఈవో రాధిక

మిరుదొడ్డి, ఏప్రిల్ 27: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని డీఎంజీ బాలకిషన్ సూచించారు. శనివారం మండలంలోని అల్వాల గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రైతులను మోసం చేసే రైస్‌మిల్లర్లపై నిఘా ఉంచుతామని తెలిపారు. ఆయన వెంట ఐకేపీ సిబ్బంది తదితరలున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

దూళిమిట్టఏప్రిల్ 27: దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని దూళిమిట్ట క్లస్టర్ వ్యవసాయ అధికారి రాధిక సూచించారు. శనివారం లింగాపూర్, జాలపల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. దూళిమిట్ట క్లస్టర్‌లోని ఐకేపీ సెంటర్లలో ప్రతీరోజు అందుబాటులో ఉంటానని, రైతులకు ఏ రకమైన సందేహాలు ఉన్నా సంప్రదించాలని కోరారు.



మిరుదొడ్డి మండలంలోని అల్వాల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులో మాట్లాడుతున్న బాలకిషన్